http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 30 డిసెంబర్ 2025

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



### సీఎం రేవంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి

## వెళ్లిపోయిన కేసీఆర్

- మూడోసారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్..
- బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలతో భేటీ
- కృష్ణా జలాల పంపిణీపై జరగనున్న శీతాకాల సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలున్నాయి.

హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం అయ్యాయి. సమావేశాలకు హాజరైన ప్రతిపక్ష నేత కేసీఆర్.. పట్టుమని అరగంట కూడా ఉండకుండా వెళ్లిపోయారు. అయితే ఈలోపే సభలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. మూడోసారి అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్.. బీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆపై శాసన సభ ప్రారంభం అయ్యి.. జాతీయ గీతం ఆలాపన దాకా ఉన్నారు. అంతకంటే కాస్త ముందు.. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేత వద్దకు వెళ్లి పలకరించారు. - మిగతా3లో

### ప్రతిపక్ష పార్టీల వైఖరిని

# ఎండగట్టాలి



- బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకునే పనిలో ఉంది: సీఎం రేవంత్‌రెడ్డి
- వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేసిన సర్కార్
- ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ అస్త్రశస్త్రాలు
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సహా, నదీజలాల అంశంపై శాసనసభా వేదికగా బీఆర్ఎస్‌ను ఎండగట్టేందుకు సీఎం ఆదేశాలు
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించిన రేవంత్‌రెడ్డి
- జూరాల నుంచి అయితే తక్కువ ఎత్తుకే ఎత్తిపోయవచ్చు

హైదరాబాద్

అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. విపక్షాల విమర్శలను తిప్పికొట్టే వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేసింది. కృష్ణా, గోదావరి నీటి వాటాల పంపిణీపై దీటుగా సమాధానమిచ్చేందుకు సన్నద్ధమైంది. రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ విస్తరణ తదితర అంశాలపై చర్చకు సమాయత్తమవుతోంది. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టేందుకు అధికార కాంగ్రెస్ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సహా, నదీజలాల అంశంపై శాసనసభ వేదికగా బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేలా సమగ్ర సమాచారాన్ని - మిగతా3లో



### అరావళి'పై 'సుప్రీం' స్టే పాత ఉత్తర్వుల నిలిపివేత

- గత నవంబర్ 20న సుప్రీంకోర్టు.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సూచించిన నిర్వచనాన్ని ఆమోదించింది.
- స్థానిక భూతలానికి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలనే అరావళి శ్రేణిగా గుర్తించాలి
- కేవలం ఎత్తును ప్రాతిపదికగా తీసుకుంటే, దాదాపు 90 శాతం అరావళి ప్రాంతం రక్షణ కోల్పోతుంది



### పాకిస్థాన్‌లో కొత్త టెర్రరిస్ట్ లీడర్

- హాఫీజ్, మసూద్ పనికిరారని భావిస్తున్న పాక్ ప్రభుత్వం
- ముఖాలు మార్చుకుంటున్న పాకిస్థాన్ టెర్రరిజం
- తెరపైకి కొత్త ఉగ్ర నేత యాకూబ్ షేక్
- యాకూబ్ ను 2012లోనే ఉగ్రవాదిగా గుర్తించిన అమెరికా

### బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం

- పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు
- ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోంది
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



### ఏడు రోజులు


# రణరంగమే

- జనవరి 2 నుంచి 7వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు
- స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం
- 15 రోజులు సమావేశాలు జరపాలని పట్టుపట్టాం
- 32 అంశాలపై చర్చించాలని కోరాం : బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- రేపట్నుంచి జనవరి 1 వరకు సమావేశాలకు విరామం
- రెండు గంటలు సాగిన శాసనసభ



హైదరాబాద్


శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలుత ఇటీవల మరణించిన దివంగత మాజీ ఎమ్మెల్యే, మండలి సభ్యులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం పలు ఆర్డినెన్స్‌లను ఉభయసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్‌ను కొనసాగించగా పలువురు సభ్యులు తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. బీఏసీలో శాసనసభ సమావేశాలు జనవరి 2 నుంచి 7 వరకు జరపాలని నిర్ణయించారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తొలిరోజున దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డిదామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాపం తెలిపింది. అనంతరం స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. శాసన మండలిలో మాజీ ఎమ్మెల్సీలు మాధవరం - మిగతా3లో



### ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

- విమాన, రైలు సేవలపై ప్రభావం..
- రెడ్ అలర్ట్ ఇష్యూ చేసిన ఐఎండీ
- అతిసమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి
- ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే దాదాపు 128 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి

## ఇలా చేస్తే పదవులు ఊస్ట్!



- సర్పంచి, ఉప సర్పంచిలకు హెచ్చరిక
- సర్పంచి, ఉప సర్పంచిలకు చెక్ పవర్
- పంచాయతీ అవసరాలు, అభివృద్ధికి ఖర్చు చేసే ప్రతి రూపాయికి ఇద్దరి ఆమోదం తప్పనిసరి
- పొరపాటు చేస్తే ఒక్కోసారి ఇద్దరి పదవులకు ఎసరు
- నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం

హైదరాబాద్

తెలంగాణ పంచాయతీ పాలకవర్గంలో సర్పంచి, ఉప సర్పంచికి సంయుక్తంగా చెక్ పవర్ ఉంటుంది. పంచాయతీ అవసరాలు, అభివృద్ధికి ఖర్చు చేసే ప్రతి రూపాయికి ఇద్దరి ఆమోదం కచ్చితంగా ఉండాలి. ఐతే ఇద్దరి సంతకాల చుట్టూ జరిగే రాజకీయాలు, పొరపాట్లు ఒక్కోసారి వారిద్దరి పదవులకే ఎసరుపెడతాయి. చెక్ పవర్ అనేది ప్రజాధనాన్ని రక్షించేందుకు ఇచ్చిన నమ్మకం. ప్రతి పైసా ఖర్చుకు గ్రామ సభ తీర్మానం కచ్చితంగా ఉండాలి. నగదు రూపంలో కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల వినియోగం - మిగతా3లో



### మహా రాజకీయాల్లో కీలక పరిణామం..

- కలిసిపోయిన పవార్ కుటుంబం.. మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ
- ప్రస్తుతం సీట్ల సర్దుబాటు జరుగుతోంది
- త్వరలో అధికారిక ప్రకటన వస్తుంది

# కారుణ్య నియామకం హక్కు కాదు.. తక్షణ భరోసా

ప్రభుత్వ ఉద్యోగుల మరణానంతరం వారి కుటుంబ సభ్యులకు కల్పించే కారుణ్య నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కారుణ్య నియామక ప్రాతిపదికన ఒకసారి ఉద్యోగాన్ని అంగీకరించిన తర్వాత, తమకు అర్హత ఉన్నా అంతకంటే ఉన్నత పదవి కావాలని కోరుతూ దరఖాస్తు చేసుకోవడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసింది.



**కేసు నేపథ్యం**

తమిళనాడు పట్టణ పంచాయతీల్లో స్వీపర్లుగా పనిచేస్తూ మరణించిన ఇద్దరు వేర్వేరు ఉద్యోగుల కుమారులకు (ఎం.జయబల్, ఎస్.వీరమణి) వారి తండ్రుల మరణానంతరం 2007, 2012 సంవత్సరాల్లో స్వీపర్లుగానే ఉద్యోగాలు లభించాయి. వారు ఉద్యోగంలో చేరే సమయంలో ఎలాంటి అభ్యంతరం తెలపకుండా ఆ కొలువుల్లో చేరారు. అయితే, సుమారు 3 నుంచి 9 ఏళ్ల తర్వాత తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు కావాల్సిన అర్హతలు ఉన్నాయని, అప్పట్లో అవగాహన లేక తక్కువ స్థాయి ఉద్యోగంలో చేరామని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా తీర్పునివ్వగా, దానిని సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

**సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యాంశాలు**

కారుణ్య నియామకం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు)కు ఒక మినహాయింపు మాత్రమే. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్న కుటుంబానికి తక్షణ భరోసా ఇవ్వడమే దీని ఉద్దేశం. ఇది ఒక హక్కు కాదు లేదా కెరీర్ అభివృద్ధి కోసం ఇచ్చే అవకాశం కాదు. అభ్యర్థికి ఉన్నత పదవికి కావాల్సిన విద్యార్హతలు ఉన్నప్పటికీ ఖాళీలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే తదుపరి నియామకం జరుగుతుంది. అర్హత ఉంది కదా అని ఉన్నత పదవిని డిమాండ్ చేసే హక్కు అభ్యర్థికి ఉండదు. ఉద్యోగంలో చేరిన చాలా ఏళ్ల తర్వాత (3-9 ఏళ్లు) కోర్టును ఆశ్రయించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'వేరే ఒకరికి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పదవి ఇచ్చారు కాబట్టి, మాకూ ఇవ్వాలి' అనే వాదనను కోర్టు తోసిపుచ్చింది. ఒక అధికారి చేసిన తప్పును మరొకరికి వర్తింపజేయమని కోర్టులు ఆదేశించలేవని చెప్పింది. తప్పును పునరావృతం చేయలేమని స్పష్టం చేసింది.

**న్యాయ నిపుణుల విశ్లేషణ**

ఈ తీర్పుపై న్యాయ నిపుణులు స్పందిస్తూ, ఇది ప్రభుత్వ నియామక ప్రక్రియల సమగ్రతను కాపాడుతుందని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు కేవలం మానవతా దృక్పథంతో చేసేవని, వీటిని సీనియారిటీ పెంచుకోవడానికి లేదా ఉన్నత పదవులు అనుభవించడానికి వాడుకోలేమని ఈ తీర్పు ద్వారా స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన పాత తీర్పును కొట్టివేస్తూ, పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో కారుణ్య నియామకం పొందిన వారు భవిష్యత్తులో ఉన్నత పదవుల కోసం ఇలాంటి క్లెయిమ్స్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది.

# పాకిస్థాన్‌లో కొత్త టెర్రరిస్ట్ లీడర్

భారత్‌పై ఉగ్రదాడుల పన్నాగాలకు వేదికగా మారిన పాకిస్థాన్... పేర్లు మారుస్తూ, ముఖాలు మార్చుకుంటూ ఉగ్రవాదాన్ని కొనసాగిస్తూనే ఉంది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిస్థితులు కొంత మారినట్టు కనిపించినా, వాస్తవం మాత్రం మరోలా ఉంది. ఒకప్పుడు భారత్‌కు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులుగా ఉన్న హఫీజ్ సయీద్, మసూద్ అజార్ వంటి వాళ్లు ఒక్కసారిగా వార్తల నుంచి మాయమయ్యారు. వారంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇదే సమయంలో పాకిస్థాన్ మరో కొత్త ఉగ్ర నేతను ముందుకు తెచ్చిందన్న ఆరోపణలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వస్తున్నాయి. ఆ కొత్త ఉగ్ర నేత పేరు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్. లష్కరే తోయిబా నుంచి ఉగ్ర శిక్షణ పొందిన ఇతడు, ఇప్పుడు స్వతంత్రంగా తనకంటూ ఓ కొత్త సంస్థను నిర్మించుకున్నాడు. ఆ సంస్థ పేరు సెంట్రల్ ముస్లిం లీగ్. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ సంస్థను పాకిస్థాన్‌లో ఒక రాజకీయ పార్టీగా నమోదు చేశారు. అంతే కాదు, దీనికి పాక్ సైన్యం పరోక్షంగా మద్దతు ఇస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**యాకూబ్ షేక్ నేపథ్యం**

1972లో పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జన్మించిన ఖారీ యాకూబ్, మొదట మదర్సాలో చదువు పూర్తిచేసి



మతప్రచారకుడిగా తన జీవితాన్ని ప్రారంభించాడు. అయితే క్రమంగా తీవ్రవాద భావజాలానికి లోనై ఉగ్రవాద మార్గంలోకి మళ్లాడు. 2012లోనే అమెరికా అతడిని అధికారికంగా ఉగ్రవాదిగా గుర్తించింది. అప్పట్లో అతడు లష్కరే తోయిబా కోసం పనిచేస్తున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు, జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని పలు ఇంటెలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి. 2017లో దిఫా-ఏ-పాకిస్థాన్ కౌన్సిల్ తరపున ఎన్నికల్లో పోటీ చేసిన యాకూబ్ ఓడిపోయాడు. అయినా రాజకీయాల్ని, ఉగ్రవాదాన్ని కలిపి నడిపే ప్రయత్నాన్ని మాత్రం ఆపలేదు. 2025 ప్రారంభంలో ఆఫ్ఘనిస్థాన్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన సమయంలో, యాకూబ్ తాలిబాన్ పాలనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేశాడు. ఇదే అంశం పాక్ సైన్యానికి అతడిని దగ్గర చేసింది. అప్పటి నుంచి యాకూబ్‌కు సైన్యం అండగా నిలుస్తోందన్న ప్రచారం మొదలైంది. ఆపరేషన్ సిందూర్‌లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 14 మంది మరణించారు. హఫీజ్ సయీద్‌కు చెందిన రహస్య స్థావరాలు కూడా ధ్వంసమయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరూ పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వారు పాక్ సైన్యం నిఘాలోనే భద్రంగా ఉన్నారని సమాచారం. ఇదే సమయంలో పాకిస్థాన్ దేశంలో తెహ్రీక్-ఇ-తాలిబాన్, బలూచ్ లిబరేషన్ ఆర్మీ వంటి ఉగ్రసంస్థలు సైన్యానికి పెద్ద సవాలుగా మారాయి. వీటిని అణచివేయడంలో పాక్ సైన్యం విఫలమవుతోంది. ఈ పరిస్థితుల్లోనే పాకిస్థాన్ మరోసారి పాత పద్ధతికే వెళ్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత ఉగ్రనేతలు అయిన హఫీజ్, మసూద్ ఇక పనికిరారని భావించి, వారి స్థానంలో కొత్త ముఖాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నమే ఖారీ యాకూబ్ షేక్ అని అంటున్నారు. ఉగ్రవాదాన్ని రాజకీయాల ముసుగులో దాచిపెట్టి, ప్రపంచాన్ని మభ్యపెట్టే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోందన్న విమర్శలు మరింత బలపడుతున్నాయి.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..

దేశ రాజధాని ఢిల్లీని ప్రమాదకరమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. అతిసమీపంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్ర పొగమంచు నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ఫాగ్ లైట్లను ఉపయోగించాలని సూచించింది. అత్యవసర పరిస్థితి ఉంటేనే బయటకు రావాలని హెచ్చరించింది. పొగమంచు కారణంగా విజిబిలిటీ పడిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే దాదాపు 128 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. అందులో 64 అరైవల్స్ కాగా, 64 డిపార్చర్స్ ఉన్నాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు విమాన స్టేటస్‌ను చెక్‌చేసుకోవాలని సూచించింది. మరోవైపు విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. మరోవైపు.. పలు రైళ్లు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జనశతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇవాళ ఉదయం ఢిల్లీలో గాలి



నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 402గా నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపింది. నగరంలోని 40 ఎయిర్ మానిటరింగ్ కేంద్రాల్లోని 25 కేంద్రాల్లో ఇవాళ ఉదయం 7 గంటలకు గాలి నాణ్యత సూచిక తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. వివేక్ విహార్‌లో అత్య ధికంగా 460గా నమోదైంది. ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్‌లో 444గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.

## సీజేఐ చంద్రచూడ్ అని చెప్పి డిజిటల్ అరెస్ట్.. రూ.3.71 కోట్లు కోల్పోయిన 68 ఏళ్ల మహిళ

ముంబై: ముంబైకి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలిని.. సైబర్ నేరగాళ్లు దారుణంగా మోసం చేశారు. బెదిరింపులకు పాల్పడి ఆమె అకౌంట్ నుంచి సుమారు 3.71 కోట్లు కాజేశారు. డిజిటల్ అరెస్టుకు చెందిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ అని చెప్పి సైబర్ నేరగాడు ఆ మహిళను మోసం చేశాడు. సీబీఐ, పోలీసు అధికారులమని ఆమెను నమ్మించారు. అంధేరీ ఈస్ట్‌లో ఆ బాధిత మహిళ 26 ఏళ్లుగా జీవిస్తోంది. ఆగస్టులో ఆమెకు తొలిసారి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పోలీసులమని చెప్పి ఆమెతో పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత వాట్సాప్‌లో వేర్వేరు నెంబర్ల నుంచి వీడియో కాల్స్ వచ్చాయి. ఆధార్ కార్డుతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసినట్లు వీడియో కాల్‌లో ఆ బాధిత మహిళను ఓ వ్యక్తి బెదిరించాడు. ఆ అకౌంట్ ద్వారా సుమారు ఆరు కోట్ల అక్రమ లావాదేవీలు జరిగినట్లు చెప్పాడు.




అయితే తనకు బ్యాంక్ అకౌంట్ లేదని ఆమె చెప్పిన తర్వాత.. ఫేక్ పోలీసు ఫిర్యాదు ఫోటోలను ఆమెకు పంపారు. సీబీఐ లోగో ఉన్న డాక్యుమెంట్లను కూడా బాధిత మహిళకు మెసేజ్ చేశారు. ఈ విషయం గురించి ఫ్యామిలీలో ఎవరికీ చెప్పవద్దు అని , ఒకవేళ చెబితే వాళ్లను అరెస్టు చేస్తామని బెదిరించారు. 24 గంటల నిఘాలో ఉన్నట్లు ఆమెను బెదిరించారు. కేసు విచారణ చేపడుతున్నామన్నారు. ఇక ఆ తర్వాత ఓ వ్యక్తి వీడియో కాల్‌లో వచ్చి, తాను జడ్జి చంద్రచూడ్ అని పరిచయం చేసుకున్నాడు. ఆ తర్వాత ఆ మహిళను ప్రశ్నించాడు. బెయిల్ నిరాకరిస్తున్నట్లు ఆమెను బెదిరించాడు. దీంతో తన వద్ద ఉన్న డబ్బును డిపాజిట్ చేయాలని సైబర్ నేరగాళ్లు ఆమెను బెదిరించారు. మ్యూచువల్ ఫండ్స్ తీసి ఆ డబ్బును ఆర్టీజీఎస్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలని ఆదేశించారు. పోలీసుల తనపై చర్య తీసుకునే అవకాశం ఉందన్న భయంతో.. ఆమె సుమారు 3.71 కోట్ల డబ్బును బదిలీ చేసింది. మళ్లీ మళ్లీ డబ్బులు అడగడంతో ఆమె తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. చాటింగ్ లాగ్, కాల్ డిటేల్స్, ట్రాన్‌జాక్షన్ రికార్డులు, బ్యాంక్ స్టేట్మెంట్లలను ఆమె పోలీసులకు సమర్పించింది.

## అరావళి'పై 'సుప్రీం' స్టే: పాత ఉత్తర్వుల నిలిపివేత



**న్యూఢిల్లీ:** అరావళి పర్వత శ్రేణుల నిర్వచనాన్ని పరిమితం చేస్తూ, గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై సోమవారం సుప్రీంకోర్టు స్టే విధించింది. సముద్ర మట్టం నుండి కనీసం 100 మీటర్ల ఎత్తులో ఉన్న భూభాగాలను మాత్రమే అరావళి పర్వతాలుగా పరిగణించాలంటూ, ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు కోర్టు మొగ్గు చూపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి, తన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ, కీలక నిర్ణయం తీసుకుంది. గత నవంబర్ 20న సుప్రీంకోర్టు.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సూచించిన నిర్వచనాన్ని ఆమోదించింది. దీని ప్రకారం స్థానిక భూతలానికి 100 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలనే అరావళి శ్రేణిగా గుర్తించాలని పేర్కొంది. అయితే ఈ నిర్ణయంపై పర్యావరణ వేత్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం ఎత్తును ప్రాతిపదికగా తీసుకుంటే, దాదాపు 90 శాతం అరావళి ప్రాంతం రక్షణ కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వరంగా మారుతుందని వారు పేర్కొన్నారు. ఈ వివాదాస్పద నిర్వచనంపై పలు విమర్శలు వచ్చిన దరిమిలా సుప్రీంకోర్టు ఈ అంశాన్ని తిరిగి విచారించాలని నిర్ణయించింది. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా అరావళి పర్వతాలు ఒక రక్షణ కవచం మాదిరిగా ఉపకరిస్తున్నాయని, దేశంలోని అత్యంత పురాతన పర్వత శ్రేణులైన వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని కోర్టు పేర్కొంది. కాగా గతంలో సర్వే ఆఫ్ ఇండియా సహాయంతో మ్యాపింగ్ ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. అయితే తాజా స్టే ఆర్డర్ నేపథ్యంలో ఈ ప్రక్రియ నిలిచిపోనుంది. సోమవారం జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం 'ఆరావళి'పై విచారణ జరిపింది.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం



బంగ్లాదేశ్ చొరబాటుదారులు అస్సాంలోనే కాకుండా.. దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అస్సాంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ.. పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటుబ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు.
అస్సాంలో కాంగ్రెస్ ఎన్నోఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అమిత్ షా (టూఎక్ రాష్ట్రుష్ట్ర) అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపైనా దృష్టి పెట్టారన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో పాగా వేసిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి భాజపాకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. గత 11 ఏళ్లలో భాజపా ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకుందన్నారు.

## మహా రాజకీయాల్లో కీలక పరిణామం..



మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. రెండేండ్ల క్రితం విడిపోయిన 'పవార్' కుటుంబం స్థానిక ఎన్నికల వేళ కలిసిపోయింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ శరద్ పవార్ ఒక్కటయ్యారు. త్వరలో జరగబోయే పింప్రి-చించ్‌వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్‌సీపీ (ఎస్పీ)-ఎన్‌సీపీ కలిసి పోటీ చేయనున్నాయి. ఈ విషయాన్ని అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. 'పవార్ పరివార్ (కుటుంబం) మళ్లీ కలిసింది' అని ప్రకటించారు. జనవరి 15న జరగబోయే ఎన్నికల్లో కలిసి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సీట్ల సర్దుబాటు జరుగుతోందని తెలిపారు. త్వరలో అధికారిక ప్రకటన వస్తుందని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంపై దృష్టిపెట్టాలని సూచించారు. కాగా, ఇప్పటికే ఠాక్రే సోదరులు కలిసిపోయిన విషయం తెలిసిందే. సుమారు రెండు దశాబ్దాల తర్వాత ఠాక్రే సోదరులు ఏకమయ్యారు. విభేదాలతో విడిపోయిన శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాక్రే బుధవారం ఒకే వేదికపై కన్పించారు. వచ్చే నెలలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరూ కలిసి పోటీ చేయనున్నట్టు ప్రకటించారు. ఇప్పుడు పవార్ ఫ్యామిలీ కూడా ఒక్కటి కావడంతో మహా రాజకీయాలు రసవత్తరంగా మారనున్నాయి.

# ఏడు రోజులు రణరంగమే

-మొదటిపేజీ తరువాయి

జగపతిరావు, అహ్మద్ పీర్ షబ్బీర్‌లకు సంతాపం ప్రకటించారు. అనంతరం బీఎస్టీ సవరణల ఆర్డినెన్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ మొదటి, రెండో సవరణల ఆర్డినెన్స్‌లు, పురపాలక సంఘాల సవరణల ఆర్డినెన్స్, తెలంగాణ సమగ్ర శిక్షా ఆడిట్ నివేదిక, పీఎం స్కూల్ రైజింగ్ ఇండియా ఆడిట్ రిపోర్ట్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సవరణల ఆర్డినెన్స్‌లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉభయ సభల్లో ప్రవేశ పెట్టారు. తెలంగాణ పంచాయతీ రాజ్ సవరణల ఆర్డినెన్స్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఉభయసభల్లో ప్రవేశ పెట్టారు. ఆయా ఆర్డినెన్స్‌ల ద్వారా తెచ్చిన సవరణలకు చట్టబద్ధత కల్పించేందుకు ప్రస్తుత సమావేశాల్లో బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాలు రద్దు చేసిన స్పీకర్ జీరో అవర్ నిర్వహించారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐలకు చెందిన సభ్యులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు రెండు గంటలు శాసనసభ సాగింది.

**బీఏసీ సమావేశం**

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశం జరిగింది. అసెంబ్లీ సమావేశాలపై బీఏసీ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన బీఏసీ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు హాజరయ్యారు. మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అసెంబ్లీ పనిదినాలు ఎజెండాను ఈ సమావేశంలో ఖరారు చేశారు.

**15 రోజులు సమావేశాలు జరపాలని పట్టుపట్టాం**

బీఏసీ సమావేశం ముగిసిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు జరపాలని పట్టుపట్టామని వివరించారు. వారం రోజులు జరిపి మళ్లీ బీఏసీ పెడతామన్న స్పీకర్ చెప్పారన్న హరీశ్‌రావు అసెంబ్లీలో పీపీటీ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. ఆలోచించి నిర్ణయం



తీసుకుంటారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారని ఆయన వివరించారు. గతంలో కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వనందుకు బహిష్కరించామని భట్టి విక్రమార్క అన్నారని హరీశ్ గుర్తుచేశారు. ఇప్పుడు మీరు(కాంగ్రెస్ ప్రభుత్వం) ఇవ్వకపోతే మేము బాయ్‌కాట్ చేయాలా అని అడిగామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరాం : బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ సమావేశాలు కనీసం 20 రోజులైనా నిర్వహించాలని కోరామన్నారు. 32 అంశాలపై చర్చించాలని కోరినట్లుగా వివరించారు. జనవరి 2 నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని వివరించారు. జనవరి 7న మళ్లీ బీఏసీ సమావేశం ఉంటుందని తెలిపారు. 2 రోజులు సమావేశాలు పెట్టి చేతులు దులుపుకోవటం సరికాదని వివరించారు.

"రాష్ట్రం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉంది. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం లేనటువంటి ప్రభుత్వం, మళ్లీ యథావిధిగా మూడు నాలుగు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగించేవిధంగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం, అనేక అంశాలపై దర్యాప్తు చేయించి బాధ్యులను జైళ్లో పెడతానని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారు. ఎన్నికల ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుమీద అనేక హామీలు ఇచ్చారు. వాటిపై చర్చించే దమ్ము, ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నిస్తున్నా. ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించేందుకు సమయం కూడా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంతో మ్యాచ్‌ఫిక్సింగ్‌కు ప్రయత్నిస్తోంది. అసెంబ్లీలో అన్ని అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం"-ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ నేత

నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ : శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు శాసనసభ శీతాకాల సమావేశాలు ఇరవై రోజులు నిర్వహించాలని స్పీకర్‌ను కోరినట్టు చెప్పారు. చివరకు స్పీకర్ ఏడు రోజులు సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బీఏసీ భేటీకి ముందు స్పీకర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నీటిపారుదలకు సంబంధించిన అంశాలపై పీపీటీకి అవకాశం ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు. నీటిపారుదల రంగంపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు అవకాశం కల్పించినప్పుడు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఇవ్వాలని కోరారు.

# ఫస్ట్ నుంచి నుమాయిష్...

**హైదరాబాద్ :** బాగ్యనగర సంస్కృతికి నిదర్శనమైన నాంపల్లి నుమాయిష్ 85వ ఎడిషన్ జనవరి 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. దేశవిదేశాలకు చెందిన సుమారు 2,000 స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశ రుసుము రూ.50 కాగా.. ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితం. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్, మెట్రో రాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు 82 ఫైర్ పాయింట్లు, ప్రత్యేక నిఘా టవర్లను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సంస్కృతిలో విడదీయలేని భాగమైన ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్) మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రదర్శన గురించి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం కీలక వివరాలను వెల్లడించారు. సుమారు 85 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రదర్శన.. హైదరాబాద్ వాసులకు కేవలం షాపింగ్ వేదిక మాత్రమే కాదు.. ఒక భావోద్వేగంతో కూడిన వేడుక అని ఆయన పేర్కొన్నారు. 85వ నుమాయిష్ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు వైభవంగా సాగనుంది. జనవరి 1న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రదర్శనను అధికారికంగా ప్రారంభిస్తారు. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఉంటుంది. శని, ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాల్లో రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుంది. ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలుగా నిర్ణయించారు. అయితే.. 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం పూర్తిగా ఉచితం. ఈసారి నుమాయిష్‌లో గతంలో కంటే ఎక్కువ స్టాళ్లు, వైవిధ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. దేశ విదేశాలకు చెందిన ఉత్పత్తులతో మొత్తం 2,000 కంటే ఎక్కువ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 1,050 మంది తయారీదారులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని ఇక్కడ ప్రదర్శించనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను



ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి స్టాళ్ల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రిజర్వ్ బ్యాంక్, అటవీ శాఖ, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాలు కూడా తమ సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. సందర్శకుల కోసం 20కి పైగా ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ హైదరాబాద్ ప్రత్యేక రుచులతో పాటు వివిధ ప్రాంతాల వంటకాలను ఆస్వాదించవచ్చు.సుమారు 25 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 82 ఫైర్ పాయింట్లు ఏర్పాటు చేశారు. లక్షన్నర లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు నీటి సంపులను సిద్ధం చేశారు. ప్రతి రెండు పాయింట్లకు ఒక అగ్నిమాపక సిబ్బంది పహారా కాస్తారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక వాచింగ్ టవర్లు, సీసీటీవీ కెమెరాలను అమర్చారు. 330 మంది వలంటీర్లు సందర్శకులకు సహకరించనున్నారునాంపల్లి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్ల నుంచి రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు.నుమాయిష్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదు.. ఒక విద్యా నిధి కూడా. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ సుమారు 19 విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఇందులో దాదాపు 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోంది. షాపింగ్, వినోదం , సామాజిక సేవల కలయికగా సాగే నాంపల్లి ఎగ్జిబిషన్, ఈ ఏడాది కూడా హైదరాబాద్ వాసులకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# సింగిల్ డిజిట్‌కు టెంపరేచర్

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్రమైన చలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిర్మల్ వంటి జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాబోయే సోమ, మంగళవారాల్లో చలి ఇంకా పెరిగే అవకాశం ఉందని.. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ 14 జిల్లాలకు 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది.ఈ తీవ్రమైన చలి గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలి ప్రభావం వల్ల కేవలం జలుబు, దగ్గు మాత్రమే కాకుండా.. రక్తపోటు పెరగడం, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఈ సమయంలో బయట తిరగకపోవడమే మంచిదని చెబుతున్నారు. చలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మఫ్లర్లు, సాక్సులు తప్పనిసరిగా ధరించాలని.. పడక గదిలో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలన్నారు.ఎప్పుడూ వేడిగా ఉండే తాజా ఆహారాన్ని తీసుకోవాలని.. ఇది శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచుతుందని చెబుతున్నారు. చలికాలంలో దాహం తక్కువగా వేస్తుంది, కానీ డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటానికి గోరువెచ్చని నీటిని తగినంతగా తాగుతూ ఉండాలని... అల్లం టీ, కషాయం లేదా సూప్‌లు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని అంటున్నారు. చలి వల్ల చర్మం పొడిబారి పగుళ్లు వచ్చే అవకాశం ఉంటుంది, కాబట్టి మాయిశ్చరైజర్లు లేదా కొబ్బరి నూనెను రాసుకోవాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి.. ఆ సమయంలో ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలని. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తల, చెవులను కప్పి ఉంచేలా జాగ్రత్త పడాలని చెబుతున్నారు.ఇంటి లోపల వెచ్చదనం కోసం నిప్పు రగిల్చినప్పుడు గాలి ఆడేలా చూసుకోవాలని.. లేదంటే కార్బన్ మోనాక్సైడ్ వంటి విషవాయువుల వల్ల ప్రమాదం సంభవించవచ్చునని అంటున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ.. అప్రమత్తంగా ఉండటం ద్వారా ఈ చలి కాలం వచ్చే అనారోగ్యాల నుంచి మనల్ని మనం రక్షించుకోవచ్చునని చెబుతున్నారు.

## ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టాలి

-మొదటిపేజీ తరువాయి

ఆధారాలతో సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లతో సీఎం సమావేశమయ్యారు.

**బీఆర్ఎస్‌కు దీటైన సమాధానం ఇచ్చేందికు సిద్ధమైన కాంగ్రెస్**

నదీ జలాల్లో వాటా, ఏపీతో వివాదాలు, బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలు, తదితరాలపై ఆరా తీశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉన్న తరుణంలో అందుకు సంబంధించిన అన్ని అంశాలపై దృష్టి సారించారు. ప్రాజెక్టు ప్రతిపాదించినప్పటి నుంచి పరిణామాలు, బీఆర్ఎస్ హయాంలో నిర్ణయాలు, పురోగతి, గత రెండేళ్లుగా పనులు, పరిణామాలపై అన్ని వివరాలు తీసుకున్నారు.

**జూరాల నుంచి అయితే తక్కువ ఎత్తుకే ఎత్తిపోయవచ్చు**

పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు కోసం మొదట జూరాల నుంచి నీటిని తీసుకోవాలని ప్రతిపాదిస్తే, దానిని శ్రీశైలం బ్యాక్ వాటర్స్‌కు ఎందుకు మార్చారన్న విషయమై సీఎం ప్రధానంగా ఆరా తీసినట్లు సమాచారం. జూరాల నుంచి నీటిని తీసుకుని ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని, అనుమతులకు ఆటంకం వచ్చేది కాదని, నీటిని తక్కువ ఎత్తుకే ఎత్తిపోయాల్సి ఉండేదని అభిప్రాయపడ్డట్లు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించి జారీ చేసిన అన్ని జీవోలు, నిపుణుల కమిటీ నివేదికలు, అంచనా వ్యయం, సవరణలు, జలాశయాలు, పంపుల నిర్మాణం, కాల్వలు - డిస్ట్రిబ్యూటరీల తవ్వకం, పరిహారం చెల్లింపులు, భూసేకరణ సహా అన్ని వివరాలు సమగ్రంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

**బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ దీటైన సమాధానం**

డీపీఆర్, బీఆర్ఎస్ హయంలోనే వెనక్కు వచ్చినప్పటికీ, అప్పటి ప్రభుత్వం స్పందించలేదని సీఎం అన్నట్లు తెలిసింది. కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి చేసుకున్న ఒప్పందాలు, మినిట్స్, తదితర ఆధారాలన్ని సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ తప్పిదాలను ఎత్తిచూపుతూ అసెంబ్లీ వేదికగా ఎండగట్టడంతో పాటు ప్రజలకు అన్ని విషయాలను వివరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకోసం అవసరమైన అన్ని ఆధారాలు, డాక్యుమెంట్లతో సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు హాజరవుతారన్న సమచారం మేరకు, ఆయన అడిగే ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం ఇచ్చేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులకు కట్టిన వడ్డీలు ఎంత, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం పరంగా తీసుకుంటున్న చర్యలను వివరించాలని నిర్ణయించారు. ప్రజలపై బారం పడకుండా ఆదాయాన్ని పెంచుకునేందుకు ఎలా ముందుకెళ్తున్నామనే అంశంపైనా సమాచారంతో సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

అదేవిధంగా ఇటీవల జీహెచ్ఎమ్‌సీ పరిధిని ఓఆర్ఆర్ వరకు విస్తరించడం, 150గా ఉన్న డివిజన్లను 300లకు పెంచడం తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చ చేపట్టే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసిన ప్రభుత్వం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సన్నదమవుతోంది. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ పరంగా ఏవిధంగా ముందుకు వెళ్లాలి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సీఎం రేవంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయిన కేసీఆర్

-మొదటిపేజీ తరువాయి

షేక్ హ్యాండ్ ఇచ్చి కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఆ సమయంలో కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి తప్ప అంతా నిల్చున్నారు.

ఆపై మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి సహా అధికార పార్టీ విప్‌లు కూడా కేసీఆర్‌ను పలకరించారు. నూతనంగా ఎన్నికైన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సైతం కేసీఆర్‌ను పలకరించి ఆశీర్వాదం తీసుకున్నారు. అయితే.. ఆ తర్వాత ఆయన సభలో కనిపించలేదు. అసెంబ్లీ అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసిన అనంతరం జీరో అవర్ ప్రారంభం కాకముందే కేసీఆర్ వెళ్లిపోయారు. అక్కడి నుంచి ఆయన నేరుగా నందినగర్ నివాసానికి చేరుకున్నారు.

కాగా, కృష్ణా జలాల పంపిణీపై జరగనున్న శీతాకాల సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలున్నాయి. ఈ అంశంపై ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి స్పందనతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధాన్ని బట్టి చూస్తే ఈసారి అసెంబ్లీ వాడీవేడిగా జరగనుందని తెలుస్తోంది. ఈసారి కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ పట్టుపడుతోంది. అయితే నేటి పరిణామం నేపథ్యంలో కేసీఆర్ సభకు హాజరవుతారా? లేదా? అనే ఉత్కంఠ కొనసాగనుంది.

## ఇలా చేస్తే పదవులు ఊస్ట్!

-మొదటిపేజీ తరువాయి

వివరాలను ఎప్పటికప్పుడు పంచాయతీ దస్త్రాల్లో నమోదు చేయాలి. ఇలా చేయటం వల్ల సర్పంచి, ఉప సర్పంచులు తమ పదవి కాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని రాజకీయ నిపుణులు అంటున్నారు.

ఇలా చేస్తే సర్పంచి, ఉప సర్పంచి పదవులు ఊస్ట్ : -

పంచాయతీ నిధులను వ్యక్తి గత అవసరాలకు వాడినా, పనులు చేయకుండా బిల్లులు విత్ డ్రా చేసినా, అంచనాలకు మించి ఖర్చు చూపినా నేరం కింద పరిగణిస్తారు. విచారణలో నిధులు దుర్వినియోగమైనట్లు రుజువు ఐతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచి, ఉప సర్పంచిలను పదవుల నుంచి తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. సర్పంచి, ఉప సర్పంచి సంతకాలను పరస్పరం ఫోర్జరీ చేసినా, అధికారులను మభ్య పెట్టి నిధులు తీసుకున్నా క్రిమినల్ కేసులు నమోదు అవుతాయి. కేవలం పదవి పోవడమే కాకుండా జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉంది.

గ్రామ సభ తీర్మానాలను అతిక్రమించి నిధులు వినియోగం చెక్కులపై సంతకాలు చేయడాన్ని అధికార దుర్వినియోగం కిందకే వస్తోంది.

సర్పంచి, ఉప సర్పంచిపై ఫిర్యాదులు అందినప్పుడు జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశిస్తారు. సరైన వివరణ ఇవ్వకపోయినా, లెక్కల్లో తేడాలు ఉన్నా, వారి చెక్ పవర్ రద్దు చేయటం లేదా పదవుల నుంచి తొలగించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది.

ఎన్నో గ్రామాల్లో సర్పంచి, ఉప సర్పంచి మధ్య ఆధిపత్య పోరు నడుస్తుంటుంది. సర్పంచి చేసే పనులకు ఉప సర్పంచి సంతకం పెట్టకపోతే నిధులు నిలిచిపోతాయి. కొన్ని సార్లు సర్పంచి చేసే పనులు సక్రమంగా ఉన్నా రాజకీయ కారణాలతో ఉప సర్పంచి సంతకం పెట్టకుండా అభివృద్ధికి అడ్డుపడ్డారనుకుంటే, అలాంటప్పుడు ఉప సర్పంచి చెక్ పవర్‌ను రద్దు చేయటమే కాకుండా పదవి నుంచి తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది.

**సర్పంచి ప్రధాన విధులు : -**

మొదటి పాలకవర్గ సమావేశం నిర్వహించిన రోజు నుంచి 5 సంవత్సరాల పాటు సర్పంచి పదవిలో ఉంటారు. గ్రామ పంచాయతీ మీటింగ్‌లకు గ్రామ సభలకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు.

రెండు నెలలకు ఒకసారి పాలకవర్గ సమావేశం నిర్వహించాలి.

సంవత్సరంలో జరిగే ఆరు మీటింగ్‌ల్లో ప్రత్యేకంగా 2 సమావేశాల్లో వృద్ధులు, మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతిని చర్చించాలి.

పంచాయతీ సభ్యుడు అనర్హతకు గురైతే జిల్లా పంచాయతీ అధికారికి సమాచారం ఇవ్వాలి.

పంచాయతీ రికార్డుల తనిఖీ, అధికారుల నుంచి సమాచారం పొందాలి.

రైతన్నలకు అప్రమత్తం చేస్తూ ఏఏ భూముల్లో ఏఏ కాలంలో ఎలాంటి పంటలు సాగు చేయాలనే దానిపై అవగాహన కల్పించాలి.

పంచాయతీ కార్యదర్శిపై పాలనాపరమైన నియంత్రణ ఉండాలి.


పాలకవర్గాల తీర్మానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సమకూరే నిధులను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలి.

ఆదాయ వనరులు పెంపు ఏర్పాట్లు చేయడం, వాణిజ్య సముదాయాలను నిర్మించి పంచాయతీ ఆదాయం పెంచుకునే ప్రయత్నం చేయాలి.

# ప్రజా సమస్యల పరిష్కారమే మేఘారెడ్డి లక్ష్యం

## అసెంబ్లీలో వనపర్తి నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావన

## శీతాకాల సమావేశాల్లో కీలక అంశాలు లేవనెత్తిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశంలో వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రస్తావించారు. రెవెన్యూ, దేవాదాయ, అటవీ, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. వనపర్తి మండలం నాగవరం, రాజనగరం గ్రామ శివారుల్లోని కొన్ని రెవెన్యూ భూములు పొరపాటున దేవాదాయ భూములుగా నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్త సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వనపర్తి బైపాస్ రోడ్డు నిర్మాణం కూడా ఇదే శాఖల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా నిలిచిపోయిందని, వెంటనే స్పష్టత తీసుకువచ్చి పనులు ప్రారంభించాలని కోరారు. ఖాన్ చెరువు నిర్మాణానికి సంబంధించిన 600 మీటర్ల కాలువ పనులు అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిపోయాయని, ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరు చేయించి పనులు పూర్తిచేయాలని సూచించారు. ఆముదాలబండ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పంచాయతీరాజ్ శాఖ రోడ్ల నిర్మాణం, రిన్యూవల్ సమస్యలపై కూడా సభ దృష్టికి తీసుకువచ్చారు. పెబ్బేరు మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, పెబ్బేరు సంతకు సంబంధించిన ఫైళ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, వాటిపై త్వరిత నిర్ణయం తీసుకోవాలని కోరారు. వనపర్తి పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పట్టణానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్, బుద్ధారం స్టేజ్ 2 రిజర్వాయర్, ఖిల్లా ఘనపురం గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణాల కోసం భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏ సమావేశమైనా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్లడమే తన ధ్యేయమని మేఘారెడ్డి స్పష్టంచేశారు.

## ఘనంగా ఇరుముడి మహోత్సవం

### శరణుఘోషతో శబరి బయలుదేరిన స్వాములు



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** అయ్యప్ప స్వామి ఆలయంలో ఇరుముడి ధరించిన స్వాములు ఈరోజు శబరిమల యాత్రకు బయలుదేరినారని గురుస్వామి నందిమల్ల అశోక్ తెలిపారు. ముత్తు కృష్ణ గురుస్వామి ఆధ్వర్యములో గణపతి హెూమం, స్వామి వారికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం గురుస్వామి ముత్తు కృష్ణ వాకిటి శ్రీధర్, నందిమల్ల. అశోక్, ఆవుల రమేష్ బృందానికి ఇరుముడులు కట్టి ఆశీర్వదించారు. బి.ఆర్.ఎస్ నాయకులు గట్టు యాదవ్, పలుస. రమేష్ గౌడ్, రంగాపురం. కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్స్ బండారు. కృష్ణ, ఉంగ్లం. తిరుమల్, కంచె. రవి, ప్రేమ్ నాథ్ రెడ్డి, డాక్టర్. డ్యానియల్ తదితరులు స్వాములకు కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పన

### డైజియో సంస్థ ఆధ్వర్యంలో టార్క్ ఫౌండేషన్.



**అగ్నిధారన్యూస్ చిన్నంబావి మండలం** చిన్నంబావి మండల పరిధిలోని పెద్ద దగడ జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల లో మౌలిక వసతుల కొరకు శంకుస్థాపన చేయడం జరిగింది. కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, మినరల్ వాటర్ ప్లాంట్, ఓల్డ్ బిల్డింగ్ పెయింటింగ్, టాయిలెట్స్ రేనోవేషన్, ప్లే గ్రౌండ్ లెవెలింగ్, మొదలగు వసతులు కల్పించడానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ రాజత్ సింగ్ (ఢిల్లీ) ఫీల్డ్ ఆఫీసర్ చిరంజీవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు పంచాయతీ కార్యదర్శి రాజబాబు, చిన్నంబావి మండలం ఎంఈఓ పిఆర్ రాజేందర్ రావు, రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జగన్ మోహన్ రావు, ఉపాధ్యాయులు శివకుమార్, కృష్ణారెడ్డి, పద్మావతమ్మ, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసులు, శివ శంకర్, ఉమావతి, గ్రామ సర్పంచ్ ఉడతలు భాస్కర్, ఉప సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, మొదలగు వారు పాల్గొనడం జరిగింది.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

### బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్టు చైర్మన్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన పూసలి రాములు అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయం మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ మృతుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ 3000 రూపాయలు, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్ 2000 రూపాయలు మొత్తం 5000 వేల రూపాయలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల మల్లేష్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వీరేష్, మాజీ ఉపసర్పంచ్ చంద్రమౌళి, పాల్గొనడం జరిగింది.

## దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి నివాళులు

### బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలోనీ వేపూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ తల్లి స్వర్గీయ కొండూరు రాములమ్మ పెద్దకర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ హాజరై, స్వర్గీయ రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాములమ్మ ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీరభద్రేశ్వర ఆలయ మాజీ చైర్మన్ అంత్యక్రియల్లో పాల్గొని పాడేమోసిన మాజీ ఎమ్మెల్యే



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పంపాడ్ గ్రామానికి చెందిన మొగసరి సంగమేశ్వర్ పాటిల్ (వీరభద్రేశ్వర ఆలయ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు) అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న అందోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి, మఠం భిక్షపతి తదితరులు సంగమేశ్వర్ పాటిల్ మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు, అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడేమోశారు.

## ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ డిసెంబర్: 29** శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలోనీ అనుబంధ శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ఉత్తర ద్వార దర్శన కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రధాన అర్చకులు గుండోజు శ్రీనివాసచార్యులు పేర్కొన్నారు . గోదావరిఖని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని నెలకొల్పిన పంచముఖ ఆంజనేయస్వామికి ఉత్తర ద్వారా దర్శన కార్యక్రమంలో భాగంగా శ్రీసీతారామాంజనేయ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, పంచామృత అభిషేకం, మంత్రోచ్ఛారణతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృప పొందాలని, అనంతరం తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

## మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ని సన్మానించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** హైదరాబాదులోనీ ఫుడ్ కమిషన్ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నీ సన్మానించిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి రెడ్డి, ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆహార భద్రత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. పేదలు, అర్హులైన లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని తెలిపారు. ముఖ్యంగా పీడీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, పారదర్శకత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కమిషన్ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తూ, తాను కూడా అవసరమైన సహకారం అందిస్తానని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.

## ప్రేమ మార్గం మానవతా దృక్పథం ఎంతో గొప్పది

– శంకర్ గౌడ్



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** యేసుక్రీస్తు చూపిన ప్రేమ మార్గం, మానవతా దృక్పథం ఎంతో గొప్పదని వనపర్తి జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. సోమవారం నాగవరంలోని పదో వార్డులో క్రిస్మస్ శుభవార్త అనే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రభువు చూపిన ప్రేమ మార్గం మానవతా దృక్పథం పేదల పట్ల ప్రేమ కరుణ ఎంతో గొప్పదని తోటి వారికి సహాయం చేసే గుణం ప్రతి ఒక్కరము కలిగి ఉండాలని ఈ వచ్చే కొత్త ఏడాది కొత్త వెలుగు నింపాలని, ప్రజల అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, సంతోషంగా అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. సాహితీ కళావేదిక తరపున అందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ గంధం బాలరాజు, పాస్టర్ విగుల శ్రీకాంత్, సోదర, సోదరీమణులు బాల, బాలికలు పాల్గొన్నారు.

## గంగవరం కి ఘన సత్కారం

### కళావేదికలు వనపర్తికి ఆస్తులు రావుల చంద్రశేఖర్ రెడ్డి



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** రచయిత గంగవరం రామకృష్ణారెడ్డి రచించిన ఖాళీ కుర్చీ, పిట్ట కొంచెం కూత గనం ఉన్నట్టుగా చిన్నగా ఉన్నందుకు పుస్తకాన్ని పూర్తిగా చదివినట్లు రావుల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి తనను ఆహ్వానించినప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల హాజరుకాలేకపోయానని అన్నారు. సాహిత్యం అంటే తనకు ఎంతో ఆసక్తి ఉందని, ముఖ్యంగా వచన కవిత్వం తనకు ఇష్టమని చెప్పారు. సాహితీ కళావేదికలు వనపర్తి జిల్లాకు ఆస్తులని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గంగవరం రామకృష్ణారెడ్డి నుంచి ఖాళీ కుర్చీ పుస్తకాన్ని స్వీకరించిన రావులను, రామకృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ముందు ముందు ఇంకా మంచి పుస్తకాలతో సాహిత్యానికి సేవలందిస్తూ ఆయురారోగ్యాలతో జీవించాలని రావులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, సాహితీ కళావేదిక అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, ఉపాధ్యాయుడు బైరోజు చంద్రశేఖర్, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మధు గౌడ్, బాలస్వామి, బండారు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ

### గ్రామ సర్పంచ్ మేకల పద్మావతి శివశేఖర్.



**అగ్ని ధార న్యూస్ చిన్నంబావి మండలం** మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మేకల పద్మావతి శివ శేఖర్, ఉప సర్పంచ్ లింగరాజు, వార్డ్ సభ్యులు, గొర్రెల కాపరులు మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల పద్మావతి శివశేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని గొర్రెల కాపారులందరూ తమ యొక్క జీవాలకు నట్టల నివారణ మందులు త్రాపించుకోవాలని సూచించారు. అదేవిదంగా పశుసంవర్ధక శాఖకు చెందిన టి.గంగరాజు (ఎల్ ఎస్ ఏ) మాట్లాడుతూ నట్టల నివారణ మందులు త్రాపించడం వల్ల గొర్రెలు, మేకలలో జీర్ణక్రియ మెరుగుపడటంతో పాటు బరువు పెరుగుదల, పాల ఉత్పత్తి పెరుగుదల, వ్యాధుల నిరోధక శక్తి బలపడుతుందని తెలిపారు. నట్టల వల్ల కలిగే రక్తహీనత, బలహీనత వంటి సమస్యలు తగ్గి, జీవాల ఆరోగ్యం మెరుగవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాజు ఓస్ మద్దిలేటి గోపాల మిత్ర, గ్రామ యాదవ సంఘమ్ అధ్యక్షులు మేకల రాముడు, గొర్రెల కాపరులు మరియు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అరెస్టులతో మాజీ సర్పంచుల గొంతు మూయలేరు

### పెండింగు బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా??

### రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని రెండు సంవత్సరాలుగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయా గ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన సుమారు 1000 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు సర్పంచుల అసెంబ్లీ ముట్టడి మేరకు ముందస్తుగా అక్రమ అరెస్టు చేయడం దారుణమని అన్నారు. వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందాల పోటీలకు, గ్లోబల్ సమ్మిట్లకు పైసలున్నాయి కానీ గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగు బిల్లుల విడుదలకు నిధుల లేవా అని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంతవరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.



## మనూర్ మండలంలో వివిధ పాఠశాలల ఆకస్మిక ఇన్స్పెక్షన్ అధికారుల తనిఖీ.



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** ప్రాథమిక పాఠశాల డోవర్ తండా తిమ్మాపూర్ పాఠశాలలో జిల్లా ఇన్స్పెక్షన్ టీం అధికారులు, యం,డి వాహబోదీన్, నిమ్మల కిష్టయ్య, పైన పేర్కొన్న పాఠశాలలకు అకస్మాత్తుగా వెళ్లి రికార్డులు తనిఖీ చేయడం జరిగింది. పాఠశాలలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు, ఎఫ్, ఎల్, ఎన్. సి. సి. ఇ. పేరెంట్స్ మీటింగ్, మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి నమోదు రికార్డులను, తరగతి ఉపాధ్యాయుల పరిశీలన, తరగతి టీ,ఎల్,యం లకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. తిమ్మాపూర్ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగు, గణితం లో ప్రతిభ కనబరిచారని జిల్లా అధికారులు సంతృప్తి వ్యక్తపరిచారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా ఇన్స్పెక్షన్ టీం అధికారులు తాగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.

## హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు?ప్రశ్నించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ :** ఇరిగేషన్ లో తానే మాస్టర్ అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అనుకుంటున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హరీష్ రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. హరీష్ రావు పై ఉత్తమ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు.. హరీష్ రావుకు అంత అహంకారం ఎందుకు? అని.. ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలు బయటపెడతామని, పాత జీవో కాపీలను మీడియాకు చూపెడతామని తెలియజేశారు. కృష్ణా జలాల్లో తాము 90టిఎంసిలు డిమాండ్ చేశామని, తాము 45 టిఎంసిలు అడిగామని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీదే బిఆర్ఎస్ బతుకుతోందని, తెలంగాణకు అన్యాయం జరిగేలా తాను ఎందుకు లేఖ రాస్తానని ఉత్తమ్ ప్రశ్నించారు. సిడబ్ల్యూసికి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని, కృష్ణా బేసిన్ పై అసెంబ్లీ ప్రజెంటేషన్ కు తాము సిద్ధమని సవాల్ విసిరారు.

## అబద్దపు పునాదుల మీద రాజకీయం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ

### తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికార మదనంతో విధ్వంసం సృష్టించారు అన్నారు. గతంలో పదవులు అనుభవించి నవాళ్లు, పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయనివారు వీధి వీధినా నాటకాలకు బయలుదేరారు. పదేళ్ల పాలనలో నెత్తిమీద అప్పు, చేతిలో చిప్ప పెట్టారు. వాళు పదేళ్లలో చేసిన విధ్వంసం వందేళ్లయినా కోలుకోలేని పరిస్థితి అని మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు తెలంగాణ రాష్ట్రాన్ని దిగజారిన ఆర్థిక వ్యవస్థగా మార్చి మనకు అప్పగించారు అన్నారు. అద్దాల మేడలు కట్టి, రంగుల గోడలు చూపించారు. ఫీజు రీయింబర్స్ మెంట్, రైతు రుణమాఫీ చేయలేని పరిస్థితికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చింది అని వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన ప్రభుత్వం ఆనాటి ప్రభుత్వం రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నుంచి ఆత్మ గౌరవంతో బ్రతికే పరిస్థితి కల్పించాం ఇది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరు అన్నారు. చావుల పునాదులపై అధికారంలోకి రావాలని దురాలోచనతో ప్రతిపక్షం ప్రయత్నిస్తుంది. అయినా ప్రజలు అన్ని గమనిస్తున్నారు, మీ అబద్దపు ప్రచారాలు విష ప్రచారాలు నమ్మే పరిస్థితిలో లేరు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ద్వారానే మహిళలకు గౌరవం

### మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

### అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

### మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించిన గ్రామ సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు అధిక ప్రాధాన్యాత ఇవ్వడం జరిగింది న్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు పెట్రోల్ పంపులు మంజూరు, మహిళా సంఘాల వారికి ఆర్టిసి లో బస్సులు అద్దెకు ఇచ్చి ప్రోత్సహిస్తూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళలను ప్రోత్సహిస్తుంది అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాఘవేందర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లట్టుపల్లి రమాదేవి, వార్డు సభ్యులు జోగు విజయకుమార్, జిల్లెల్ల సుహాసిని, లట్టుపల్లి వసంత, అబ్దుల్ వాజిద్, బరిగల రాధిక, బి చంద్రయ్య, జనిగే నరసింహ, చెవిటి విజయకుమార్, బుక్ కీపర్, గ్రామ మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# కూచిపూడి నృత్యంలో... "కార్తీక" ప్రతిభ...!

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో దక్కిన చోటు

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 27న నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలో కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన ఉద్దమారి శంకర్ – లావణ్య ల కుమార్తె "కార్తీక " పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. కార్తీక గత కొంత కాలంగా కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శనలతో రాణిస్తుంది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని మోడల్ స్కూల్ లో 7 వ తరగతి చదువుతుంది. అదే మందమర్రిలోని శ్రీసాయి నాట్య కళానిలయంలో కార్తీక మూడు సంవత్సరాల గా గురువు అశ్విని ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 27న హైదరాబాద్ లోని గచ్చి బౌలి స్టేడియంలో నిర్వహించిన సామూహిక కూచిపూడి నృత్య పోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్లో స్థానా న్ని సంపాదించింది. గిన్నిస్ బుక్ స్టానం సంపాదించడంతో పాటు, సర్టిఫికెట్ పతకాన్ని సాధించి కూచిపూడి నృ త్యంలో అద్భుత ప్రదర్శనతో మండలానికి వన్నె తెచ్చింది. గచ్చిబౌలి వేదికగా 7 వేల మంది చిన్నారులు ప్రదర్శించిన సామూహిక నృత్య పోటీల్లో కార్తీక ప్రతిభ చూపి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను సొంతం చేసుకో వడం పట్ల తల్లిదండ్రులు శంకర్ – లావణ్య లు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, కమాన్ పూర్ మండలంలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందనలు తెలియజేశారు.



## దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి నివాళులు

### ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలోనీ వేపూరు గ్రామానికి చెందినమాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ తల్లి స్వర్గీయ కొండూరు రాములమ్మ పెద్దకర్మ కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, హాజరై, స్వర్గీయ రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాములమ్మ ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మున్సిపాల్టీ చైర్మన్ యద్మ సత్యం, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండ పల్లి మండలంలోని లింగరావుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దేవి శంకర్ నాయక్ తల్లి బద్దెమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం గ్రామ నాయకులు ద్వారా తెలుసుకున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కుటుంబ సభ్యులకు 10,000 పదివేల రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ బూత్కురి వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, తిరుపతయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వార్డ్ సభ్యులు చెన్నయ్య, జంగయ్య, ప్రమోద్, యలమంద రెడ్డి, ప్రతాప్ రెడ్డి, చంద్రయ్య, రాములు, రామ చంద్రయ్య, జంగిలి మల్లేష్ కుమార్, రబ్బానీ, తదితరులు పాల్గొనడం జరిగింది.

## అంజిరెడ్డి మరణం బాధాకరం

### మృత దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామ పంచాయితీకి చెందిన అంజి రెడ్డి అకస్మాత్తుగా మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి వారి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోదరులు వెంకట్ రెడ్డి, దశరధరాం రెడ్డి, సర్పంచ్ దుగ్గ పురం అనిత శ్రీనివాసులు, నర్సింహా గౌడ్, రాజెందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణికి 82 ఫిర్యాదులు.**

**జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్**

**అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ.**



**అగ్నిధారన్యూస్ గద్వాల** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పలు శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావులతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారు

### పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయి: కేటీఆర్

**హైదరాబాద్ :** అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటూ కాకుండా పోయారని విమర్శించారు. వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్‌లో డోర్స్ క్లోజ్ అయ్యాయని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశమిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రౌండ్‌లో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 40 శాతం ఫలితాలు వచ్చాయని గుర్తుచేశారు.

# గోదావరిఖనిలో కట్టుదిట్టమైన పోలీస్ నాకాబంది

**నూతన సంవత్సర వేడుకలకు డీజేలకు అనుమతి లేదు**

**: డీసీపీ బి. రామ్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గోదావరిఖని పరిధిలో పోలీసులు కట్టుదిట్టమైన నాకాబంది నిర్వహించారు. అక్రమాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ బి. రామ్ రెడ్డి ఉత్తర్వులతో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డి, రవీందర్ ఆధ్వర్యంలో ఈ నాకాబంది చేపట్టారు. గోదావరిఖనిలోని ఐదు ఇంక్లైన్, విటల్‌నగర్, తిలక్‌నగర్ డౌన్, తిలక్‌నగర్, రమేశ్‌నగర్, చంద్రశేఖర్‌నగర్, సంతోష్‌నగర్, ద్వారకానగర్ ప్రాంతాల్లో ఒకేసారి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, 12 మంది ఎస్‌ఐలు, సుమారు 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వాహన తనిఖీల్లో డీసీపీ బి. రామ్ రెడ్డి, ఏసీపీ ఎం. రమేష్ స్వయంగా పాల్గొన్నారు. అక్రమ రవాణా, గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అనుమానితుల కట్టడి, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు వాహనాలు, వ్యక్తులను సమగ్రంగా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, ఫిట్‌నెస్, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలను పరిశీలించారు.



మద్యం సేవించి వాహనం నడపడం, వేగంగా వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో 80 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు, 3 కార్లకు జరిమానాలు విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని డీసీపీ స్పష్టం చేశారు. డిసెంబర్ 31న కూడా నాకాబంది కొనసాగుతుందని, రాత్రి 10 గంటల తర్వాత ప్రత్యేక మద్యం సేవించి వాహనం నడిపే తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. యువత తాత్కాలిక ఆనందాల కోసం భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ప్రజలు కుటుంబ సభ్యులతో ఇంట్లోనే వేడుకలు జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని డీసీపీ విజ్ఞప్తి చేశారు.

# తొమ్మిది రోజులుగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య సేవలు

**144 మంది కి కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి.....నేటితో ముగిసిన కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ**

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత పౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**






**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** మాడ్గుల పట్టణ కేంద్రంలోనీ శ్రీ వాసవి ఫంక్షన్ హాల్ నందు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ చెన్నై వారి సహకారంతో ఏర్పాటు చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం ముగియడం జరిగింది. కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ. విజయ వంతంగా మాడ్గుల మండల ప్రజలకు తొమ్మిది రోజులుగా ఉచిత కంటి సేవలు అందించిన సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ మాడ్గుల ఇంచార్జ్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా గత తొమ్మిది రోజులుగా సేవలు అందిస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిభిరంలో ఐదు రోజులుగా నడుస్తున్న కంటి శుక్లాల ఆపరేషన్ల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఈ శిబిరానికి మొత్తంగా. 5,200 మంది వరకు హాజరవ్వగా 3,300 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహణ, 2,504 మందికి పైగా ఉచిత కంటి అద్దాల పంపిణీ, 178 మంది పేషెంట్లు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక. అయ్యారని, వీరిలో 144 మందికి విజయవంతంగా కంటి శుక్లాల ఆపరేషన్లు పూర్తి అయ్యాయని తెలిపారు. మాడ్గుల మండల మరియు పరిసర ప్రాంత ప్రజలకు ఇంత పెద్ద ఎత్తున ఐక్యత ఫౌండేషన్ సేవలు అందించడం సంతోషకరంగా ఉందని ఇంకా ముందు ముందు మరిన్ని గొప్ప కార్యక్రమాలతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మాడ్గుల ఇంచార్జ్ సూదిని జైపాల్ రెడ్డి తో పాటు సభ్యులు రఘు, శ్రీపతి, శేఖర్, నాగిళ్ళ శివ, ఎరుకలి శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

**అదనపు కలెక్టర్ కు బాధిత కుటుంబం పిర్యాదు.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** ప్రైవేట్ వైద్యుడి సలహాతో కరీంనగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందినా ఫలితం లేదని, రూ 1లక్ష 40 వేలు ఆసుపత్రి బిల్లు దండుకున్నారని పెద్దపల్లి పట్టణం చందపల్లికి చెందిన బాధితులు నీలారపు సతీష్ రజిత దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లికి చెందిన నీలారపు సతీష్ అనే వ్యక్తికి ఈనెల 7న ఇంట్లో విద్యుత్ షాక్ రావడంతో అతని సతీమణి రజిత ఆర్ఎంపి వైద్యునికి సమాచారం అందించారు. ఆర్ఎంపి వైద్యుడు సతీష్ తన భార్య ఏఎన్ఎం శిరీషతో కలిసి నీలారపు సతీష్ ఇంటికి చేరుకొని ఏఎన్ఎం శిరీష ఇంజక్షన్ ఇచ్చారని సదరు బాధితుని భార్య రజిత పేర్కొంది. ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే నీలారపు సతీష్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా హుటాహుటిన ఆర్ఎంపి వైద్యుడు తమకు కరీంనగర్ లో ప్రైవేటు ఆసుపత్రి ఉందని తెలుపుతూ ఆసుపత్రికి తరలించాడని పేర్కొంది. అక్కడ మూడు రోజులు పరీక్షలు చేసి ఇంటికి పంపించారని, కానీ తన భర్త పక్షవాత ధోరణితో చెయ్యి కాలు పనిచేయకుండా వచ్చాడని సతీష్ భార్య రజిత తెలిపింది. తన భర్త పరిస్థితిని చూసిన నీలారపు రజిత గ్రామస్తులతో కలిసి ఆర్ఎంపి వైద్యుడు సతీష్ ను నిలదీయగా పోలీస్ స్టేషన్లో తనపై



ఫిర్యాదు చేసి బెదిరింపులకు గురి చేశారంటూ వాపోయింది. తన భర్తకు ఇంజక్షన్ వేసి తన అనారోగ్య పరిస్థితికి కారణమైన ఏఎన్ఎం శిరీష, ఆర్ఎంపి వైద్యుడు సతీష్ పై వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణు, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ లకు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు అందించారు. ప్రభుత్వ ఏఎన్ఎం అయి ఉండి ఇంజక్షన్ వేయడం సరికాదంటూ, ఆర్ఎంపి వైద్యుడు ఏఎన్ఎంపై తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సిఐటియు యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం జ్యోతి డిమాండ్ చేశారు.

## ఇవాళ నిఘా వ్యవస్థ లేదా.. ఫోన్ ట్యాపింగ్ నడుస్తలేదా..

**ఫోన్ ట్యాపింగ్‌పై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రికి ఇంటెలిజెన్స్ వస్తుందని తెలిపారు. గూఢచారి వ్యవస్థ తొలి ప్రధాని నెహ్రూ నుంచి నేటిదాకా ఉందని గుర్తుచేశారు. శాంతి భద్రతలు, రాష్ట్ర రక్షణ కోసం ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. ఇవాళ నిఘా వ్యవస్థ లేదా.. ఫోన్ ట్యాపింగ్ నడుస్తలేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయడం లేదా అని ప్రశ్నించారు. ట్యాపింగ్ నిజమైతే అధికారులు ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టడం లేదని అడిగారు. ఇప్పుడు డీజీపీ కూడా అప్పుడు అధికారిగా ఉన్నారని గుర్తుచేశారు. ఆయనకు కూడా నిఘా వ్యవస్థ గురించి అన్ని తెలుసని చెప్పారు. నిఘా వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తుందో ముఖ్యమంత్రికి అధికారులు చెప్పరని అన్నారు. వారికి ఉన్న నిబంధనల మేరకు, వారికి సమాచారం ఏవిధంగా వస్తుందో ముఖ్యమంత్రి అడగరని చెప్పారు. ఈ సిట్ వంటి డ్రామాలతో ప్రజల దృష్టిని ఎన్నిరోజులు మరలుస్తారని ప్రశ్నించారు. ఈ అటెన్షన్ డైవర్షన్‌తో ఎన్నిరోజులు కాలం వెల్లదీస్తారని నిలదీశారు. ఇన్నిరోజులు సిట్, విచారణ, కేసుల పేరుతో సాధించిందేంటని ప్రశ్నించారు. కనీసం ఒక్క దాంట్లో అయినా నిజం తెలిసిందా అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న డైవర్షన్లను ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. అందుకే ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేశారని అన్నారు. కాంగ్రెస్‌కు పరిపాలన రాదని ప్రజలకు తెలిసిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ అప్పుల ప్రచారాన్ని కూడా ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. కాగ్ లెక్కల నిజాలు కూడా ప్రజలకు తెలుసని అన్నారు. 24 నెలల్లో చేసిన రెండున్నర లక్షల కోట్ల అప్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీ చర్చ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎవరు ఏ ప్రాజెక్టులు కట్టినా తాగునీటి అవసరాల పేరుతోనే ప్రాజెక్టులు కట్టడం ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తర్వాతనే అన్ని అనుమతులు తీసుకురావడం ఆనవాయితీ అని, కానీ ఈ విషయాన్ని ఎవరూ

## సీఎంకు స్వాగతం పలికిన రామగుండం ఎమ్మెల్యే



**అగ్ని ధార న్యూస్,( రామగుండం)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సోమవారం హైదరాబాద్‌లో ఘన స్వాగతం పలికారు. శీతాకాల శాసనసభ సమావేశాల్లో పాల్గొనేందుకు అసెంబ్లీకి వచ్చిన ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించి, ప్రాంతాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కి సన్మానం



**అగ్నిధార న్యూస్** కమాన్పూర్ సోమవారం పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సిలారపు మల్లయ్య ని తన నివాసంలో మంథని నియోజక వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సన్మానించడం జరిగింది కాంగ్రెస్ నాయకులు గట్టయ్య దామెర దేవయ్య, బోనాల సత్యం బుర్ర రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఓటమి లేని నాయకుడిగా ప్రజల ప్రతినిధిగా ఉంటూ ప్రజాసేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా మల్లయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ ప్రధాన సలహాదారితో ఐఎన్‌టీయూసీ భేటీ

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** సింగరేణి కార్మికులకు సంబంధించిన ప్రధాన సమస్యలు, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల అమలుపై ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) ప్రతినిధుల బృందం సోమవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. కార్మికుల న్యాయసమ్మత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరింది. ఈ భేటీకి ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ నాయకత్వంలో కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు నరసింహ రెడ్డి, కంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకర్ రావ్, ప్రధాన కార్యదర్శులు వికాస్ కుమార్ యాదవ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలను ఐఎన్‌టీయూసీ నాయకులు సవివరంగా వివరించారు. స్పందించిన వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఈ అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి సింగరేణి సంస్థపై త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**యు ఐ పిటి కేసులు వేగంగా పూర్తి చేయాలి**

**: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న (యు ఐ పిటి) కేసులను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో త్వరితగతిన పరిష్కరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ ఆదేశించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పెండింగ్ కేసుల స్థితిగతులు, నేరస్థుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్ల దాఖలుపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి కేసుల పరిష్కార శాతాన్ని పెంచాలని సూచించారు. మహిళలపై నేరాలకు సంబంధించి సాక్ష్యాధారాలను బలంగా కోర్టుకు సమర్పించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే ఎస్సీ/ఎస్టీ, పోక్సో కేసుల్లో బాధితులకు పరిహారం త్వరగా అందేలా చూడాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, గంజాయి, డ్రగ్స్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక బృందాలతో కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీ మంచిర్యాల ఎ. భాస్కర్ ఐపీఎస్, అడిషనల్ డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండర్ లకు మాత్రమే...

**జనవరి 10 లోపు స్వయం ఉపాధి కొరకు ట్రాన్స్ జెండర్లు దరఖాస్తు చేసుకోవాలి.**

**.....జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, డిసెంబర్-29** జనవరి 10 లోపు స్వయం ఉపాధి కొరకు ట్రాన్స్ జెండర్లు దరఖాస్తు చేసుకోవాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో నివసిస్తున్న ట్రాన్స్ జెండర్ లకు స్వయం ఉపాధి, పునరావాసం కొరకు రాష్ట్ర ప్రభుత్వంచే వికలాంగులు వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ ద్వారా మన జిల్లాకు 2 యూనిట్ల ద్వారా లక్ష యాభై వేల రూపాయలు మంజూరు కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గుర్తింపు కార్డు ఉన్న 18 నుంచి 55 సంవత్సరాల వయసు గల ట్రాన్స్ జెండర్ లు స్వయం ఉపాధి యూనిట్ల కొరకు జనవరి 10 లోపు ఐడిఓసి రూమ్ నెంబర్ 114 లో గల జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తుల సమర్పించాలని, ఇతర వివరాలకు 994949461, 9440852495 నెంబర్ నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బిజినెస్

### స్టాక్ మార్కెట్ల నుంచి రూ. 1.6 లక్షల కోట్ల నిధులు తీసుకెళ్లిన ఎఫ్‌పీఐలు



విదేశీ ఇన్వెస్టర్లు ఈ ఏడాది భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి రికార్డు స్థాయిలో నిధులు ఉపసంహరించుకున్నారు. భారత కరెన్సీ రూపాయితో పాటు ఇతర కరెన్సీలూ అస్థిరం గా ఉండటం, ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు, ముఖ్యంగా అమెరికా విధించిన అధిక సుంకాలు, అధిక వాల్యూయేషన్ల కారణంగా మదుపర్లు రిస్కును తగ్గించుకోవడంతో రికార్డు స్థాయిలో రూ. 1.6 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నారు. ఇదే సమయంలో అమెరికా మార్కెట్ల నుంచి ఎక్కువ రాబడి ఉండటంతో నిధులను తరలించారు. కొందరు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) స్టాక్ మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్న నిధులను బాండ్లు వంటి సురక్షితమైన సాధనాల్లో పెట్టుబడిగా పెట్టారని, అలాగే ఇప్పటివరకు రూ. 59,000 కోట్లను డెట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేశారని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. ఈ ధోరణి కారణంగా 2025 ఏడాది ఇప్పటివరకు అత్యధికంగా ఎఫ్‌పీఐలు ఎక్కువ నిధులు ఉపసంహరించుకున్న ఏడాదిగా నిలిచింది. ఇదివరకు 2022లో రికార్డు స్థాయి రూ. 1.21 లక్షల కోట్ల విలువైన నిధులను వెనక్కి తీసుకున్నారు. విదేశీ ఇన్వెస్టర్లు నిధులను వెనక్కి తీసుకెళ్లినప్పటికీ దేశీయ మదుపర్ల కొనుగోళ్ల కారణంగా మన స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి తగ్గిందని విశ్లేషకులు వెల్లడించారు.

### భారత్‌లో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్న రోల్స్ రాయిస్



ప్రముఖ బ్రిటిష్ ఏరో-ఇంజిన్ తయారీ సంస్థ రోల్స్ రాయిస్ భారత్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా జెట్ ఇంజన్లు, నావల్ ప్రొపల్షన్, ల్యాండ్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్‌తో సహా వివిధ విభాగాల్లో అవకాశాలను అందుకోవాలని, పూర్తి సామర్థ్యాన్ని పెట్టుడుల విస్తరణ ప్రణాళికకు అనుగుణంగా యూకే వెలుపల భారత్‌ను అతిపెద్ద కేంద్రంగా ఎంచుకోవాలని చూస్తున్నట్టు రోల్స్ రాయిస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శశి ముకుందన్ ఆదివారం ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. కంపెనీ దేశంలో భారీ పెట్టుబడి కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రోగ్రామ్ కింద భారత ప్రభుత్వానికి కంబాట్ జెట్‌లను అందించడానికి కొత్త జనరేషన్ ఏరో ఇంజిన్‌ను అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ కొత్త తరహా యుద్ధ విమానాల కోసం ఇంజిన్లపై పని చేయడానికి రోల్స్ రాయిస్ భారతీయ రక్షణ డిజైనర్లతో మాట్లాడుతోంది. భారత్ సొంతంగా అభివృద్ధి చేయడానికి వీలుగా సాంకేతికత, డిజైన్లను కూడా పంచుకోవాలని భావిస్తున్నట్టు శశి ముకుందన్ వివరించారు. యుద్ధనౌకలు, జలాంతర్గాములలో ఉపయోగించే ఇంజిన్లు అయిన నావల్ ప్రొపల్షన్ సిస్టమ్‌లపై కూడా రోల్స్ రాయిస్ పని చేయాలనుకుంటోంది. ఈ వ్యవస్థలు నౌకలు వేగంగా, మరింత సమర్థవంతంగా కదలడానికి సహాయపడతాయి. ఈ రకమైన సాంకేతికతను కలిగి ఉన్న ప్రపంచంలోని కొన్ని కంపెనీలలో రోల్స్ రాయిస్ ఒకటి. కొత్త పెట్టుబడుల ద్వారా భారత్ మరిన్ని వస్తువులను తయారు చేయడంలో సహాయపడుతుంది, ఉపాధి కల్పిస్తుంది, రక్షణ పరిశ్రమను బలోపేతం చేస్తుంది. అన్నీ సానుకూలంగా జరిగితే, రోల్స్ రాయిస్ భారత్‌ను యూకే, యూఎస్, జర్మనీ లాగా ప్రధాన మార్కెట్లలో ఒకటిగా మార్చుకోవాలని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

# ఏడాదికి ఒకసారే రీఛార్జ్.. బీఎస్ఎన్ఎల్ న్యూఇయర్ ప్లాన్

ప్రస్తుత రోజుల్లో మొబైల్ అనేది తప్పనిసరిగా మారిపోయింది. ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమైపోయింది. ఒక్క క్షణం ఫోన్ లేకుంటే ఏదో కోల్పోయినట్లు అనిపిస్తుంది, ఏమీ తోచదు. అలాంటి ఫోన్ వాలిడ్ రీఛార్జ్ లేకుండా మూగబోతే మనసున పట్టదు. అప్పు చేసైనా సరే ఫోన్ రీఛార్జ్ చేస్తారు. ప్రీపెయిడ్ కస్టమర్లు గడువు ముగిసే లోపే రీఛార్జ్ చేసుకోవాలి. లేదంటే ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతాయి. దీంతో రీఛార్జ్ గడువు దగ్గరపడుతున్న సమయంలో ఏదో ఆందోళనగా ఉంటుంది. చాలా మంది నెల రోజులు, మూడు నెలల ప్లాన్స్ ఎంచుకుంటారు. దీంతో ప్రతిసారీ గడువు ముగిసే సమయంలోపు రీఛార్జ్ చేయాల్సి వస్తుంది. ఇది ఒకింత చికాకు తెప్పిస్తుందని చెప్పవచ్చు. అంతే కాదు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది. తెలియకుండానే అదనపు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ఈ ఇబ్బందులను, అదనపు భారాన్ని తప్పించుకోవాలంటే లాంగ్ టర్మ్ వ్యాలిడిటీ ప్లాన్స్ బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. ఏడాది వ్యాలిడిటీ గల రీఛార్జ్ ప్లాన్స్ ఎంచుకోవచ్చు. ఏడాదికి ఒకసారి రీఛార్జ్ చేస్తే చాలు ఎలాంటి ఇబ్బందులు, అంతరాయం లేకుండా సంవత్సరం మొత్తం కాల్స్, డేటా వాడుకోవచ్చు. ప్రభుత్వ రంగ టెలికాం కంపెనీ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ న్యూ ఇయర్ ప్లాన్ తీసుకొచ్చింది. ఈ కొత్త ఏడాదిలో ఎలాంటి రాజీ పడాల్సిన పని లేదంటూ సరికొత్త రీఛార్జ్ ప్లాన్ అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్ 365 రోజులు వ్యాలిడీ కలిగి ఉంటుంది. ఒక్కసారి రీఛార్జ్ చేస్తే ఒత్తిడి లేకుండా ఏడాది మొత్తం మొబైల్ ఫోన్ వినియోగించుకోవచ్చు. కేవలం




రూ.2799తోనే ఈ ప్లాన్ అందిస్తోంది. ఈ ప్లాన్ ద్వారా రోజుకు ఏకంగా 3జీబీ డేటా అందిస్తోంది. అలాగే అపరిమిత కాల్స్ లభిస్తాయి. ఇందులో రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా వస్తాయి. ఈ మేరకు న్యూ ఇయర్ ప్లాన్ వివరాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా బీఎస్ఎన్ఎల్ ఓ పోస్ట్ చేసింది. 'ఈ కొత్త ఏడాదిలో రాజీ పడాల్సినవసరం లేదు. బీఎస్ఎన్ఎల్ రూ.2799 ప్లాన్ ద్వారా రోజుకు 3జీబీ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు 365 రోజుల వ్యాలిడిటీతో పొందవచ్చు. ఇవన్నీ భారతీయులు నమ్మే స్వదేశీ నెట్‌వర్క్ ద్వారా లభిస్తున్నాయి. నిజమైన డేటా కింగ్ ద్వారా ఈ 2026ను ప్రారంభించండి' అంటూ రాసుకొచ్చింది. ప్రైవేట్ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వీఐ కంపెనీలు అందిస్తోన్న ఏడాది రీఛార్జ్ ప్లాన్స్‌తో పోలిస్తే ఈ ప్లాన్ ధర చాలా తక్కువే అని చెప్పవచ్చు.

# టెక్ దిగ్గజాలైన యాపిల్, గూగుల్‌ను దాటేసిన వెండి

ప్రపంచంలోని అత్యంత విలువైన ఆస్తుల జాబితాలో వెండి సంచలనం సృష్టిస్తోంది. టెక్ దిగ్గజాలైన యాపిల్, ఆల్ఫాబెట్‌లను అధిగమించి మూడో స్థానానికి చేరింది. త్వరలోనే ఎన్విడియా కార్పొరేషన్‌ను కూడా దాటి, బంగారం తర్వాత రెండో స్థానాన్ని దక్కించుకునే దిశగా పరుగులు తీస్తోంది. తాజా గణాంకాల ప్రకారం, వెండి మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.220 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. ప్రస్తుతం 4.592 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో రెండో స్థానంలో ఉన్న ఎన్విడియాకు, వెండికి మధ్య కేవలం 8.1 శాతం వ్యత్యాసం మాత్రమే ఉంది. ఇక 31.598 ట్రిలియన్ డాలర్లతో బంగారం తిరుగులేని అగ్రస్థానంలో కొనసాగుతోంది.వెండి ధరల్లో చారిత్రాత్మక ర్యాలీ కారణంగా దాని విలువ అమాంతం పెరిగింది. శుక్రవారం కామెక్స్ మార్కెట్‌లో స్పాట్ సిల్వర్ ధర ఔన్స్‌కు 75 డాలర్ల మార్కును దాటి కొత్త రికార్డు సృష్టించింది. భారత్‌లోనూ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్లో కిలో వెండి ఫ్యూచర్స్ ధర ఇంట్రాడే ట్రేడింగ్‌లో రూ. 2,33,115 ఆల్-టైమ్ గరిష్ఠానికి చేరింది.ఇదే జోరు కొనసాగితే వెండి త్వరలోనే ఎన్విడియాను అధిగమిస్తుందని ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల మధ్య అసాధారణ వ్యత్యాసం ఉందని, సాధారణంగా డాలర్ కంటే తక్కువ ఉండే కామెక్స్, షాంఘై ఎక్స్ఛేంజ్‌ల మధ్య ధరల తేడా ఇప్పుడు దాదాపు 7 డాలర్లకు చేరిందని ఆయన వివరించారు.భారత మార్కెట్లలో



వెండి దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. గతేడాది డిసెంబర్ 26న రూ. 91,600గా ఉన్న కిలో వెండి ధర, ఈ ఏడాది డిసెంబర్ 26 నాటికి 153 శాతానికి పైగా పెరిగి రూ. 2,31,879కి చేరింది. ఇదే కాలంలో 10 గ్రాముల బంగారం ధర సుమారు 80 శాతం పెరిగి రూ. 77,460 నుంచి రూ. 1,39,233కు చేరుకుంది.

## స్పోర్ట్స్

# న్యూజిలాండ్ సిరీస్‌కు ముందే 'మరోసారి' రంగంలోకి దిగనున్న విరాట్ కోహ్లి

టీమిండియా దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి న్యూజిలాండ్ సిరీస్‌కు ముందే మరోసారి రంగంలోకి దిగనున్నాడు. ఇటీవలే విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరఫున రెండు మ్యాచ్‌లు ఆడిన విరాట్, ఇదే టోర్నీలో మరో మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. జనవరి 6న ఆలుర్‌లో రైల్వేస్‌తో జరుగబోయే మ్యాచ్‌లో విరాట్ బరిలో ఉంటాడని ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ అత్యున్నత అధికారి ఒకరు క్రిక్‌బజ్‌కు లీక్ ఇచ్చారు. ఈ మ్యాచ్ ముగిసిన వెంటనే విరాట్ న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం జనవరి 7న భారత జట్టుతో పాటు బరోడాలో కలుస్తాడు. భారత్, న్యూజిలాండ్ మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జనవరి 11 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం భారత జట్టును అతి త్వరలో ప్రకటిస్తారు. ఈ జట్టులో విరాట్ ఉండటం లాంఛనమే. టీ20, టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఫార్మాట్‌లో విరాట్ ప్రస్తుతం అత్యుత్త మ ఫామ్‌లో ఉన్నాడు. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో 3 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు చేసి పరుగుల వరద పారిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడిన విరాట్.. ఓ సెంచరీ (ఆంధ్రపై 131), ఓ హాఫ్ సెంచరీ (గుజరాత్‌పై 77) చేశాడు. విరాట్ రైల్వేస్‌తో జరుగబోయే మ్యాచ్‌లోనూ సత్తా చాటితే



న్యూజిలాండ్ సిరీస్‌కు ముందు టీమిండియాకు అదనపు ధైర్యం వస్తుంది. విరాట్ తాజాగా సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు (135, 102), ఓ హాఫ్ సెంచరీ (65 నాటౌట్) చేశాడు. అంతకుముందు ఆస్ట్రేలియా పర్యటనలో తొలి రెండు మ్యాచ్‌ల్లో డకౌటైన విరాట్.. చివరి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ (74 నాటౌట్) చేసి ఫామ్‌లోకి వచ్చాడు. విరాట్ ఢిల్లీ జట్టులో ఉండటం వల్ల విజయ్ హజారే ట్రోఫీలో ఆ జట్టుకు కూడా అదనపు బలం చేకూరుతుంది.

### ఆస్ట్రేలియా బ్యాటర్ విధ్వంసం.. టీ20ల్లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ!



మహిళల టీ20 క్రికెట్‌లో మరో వేగవంతమైన అర్ధసెంచరీ నమోదైంది. ఆస్ట్రేలియాకు చెందిన లౌరా హారిస్ న్యూజిలాండ్‌లో జరుగుతున్న టి20 లీగ్‌లో ఈ ఘనత సాధించింది. కేవలం 15 బంతుల్లో ఆమె ఫిఫ్టీ బాదింది. కివీస్ లీగ్ టోర్నీ ఉమెన్ సూపర్ స్మాష్ (డబ్ల్యూఎస్ఎస్)లో ఒటాగో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె ఆదివారం కాంటర్‌బరీతో జరిగిన మ్యాచ్‌లో చెలరేగింది. అలెగ్జాండ్రాలోని మోలినెక్స్ పార్క్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో లౌరా (15 బంతుల్లో 52బీ 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచేసింది. తద్వారా 2022లో వార్విక్‌షైర్ తరఫున మేరి కెల్లీ చేసిన (15 బంతుల్లో ఫిఫ్టీ) రికార్డును సమం చేసింది. లౌరా వీరబాదుడుతో 146 పరుగుల లక్ష్యాన్ని 15వ ఓవర్లోనే ఛేదించిన ఒటాగో ఈ మ్యాచ్‌లో బోనస్ పాయింట్‌తో గెలిచింది. ఈ సీజన్ మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో నిరాశపరిచిన లౌరా.. న్యూజిలాండ్‌లో మెరుపులు మెరిపించింది. అయితే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ ఆమెకిదే మొదటిది కాదు. ఓవరాల్ టి20 లీగ్‌లలోనే ఆరుసార్లు 50 పైచిలుకు (ఫిఫ్టీలు) పరుగులు చకచకా చేసిన ఘనత ఆమెకు ఒక్కరికే దక్కుతుంది. మూడుసార్లు 18 బంతుల్లో, ఒకసారి 19 బంతుల్లో, ఇంకోసారి 17 బంతుల్లో, ఇప్పుడేమో 15 బంతుల్లో ధనాధన్ అర్ధశతకాల్ని బాదింది. ప్రత్యేకించి మహిళల టి20 క్రికెట్, లీగ్‌లలో ఆమె తప్ప ఇంకెవరూ ఒకసారి మించి వేగవంతమైన అర్ధసెంచరీల్ని బాదలేకపోయారు.

# టీ20ల్లో అరుదైన రికార్డు.. 8 వికెట్లు తీసుకున్న భూటాన్ స్పిన్నర్

**న్యూఢిల్లీ:** భూటాన్ స్పిన్ బౌలర్ సోనమ్ యేషే చరిత్ర సృష్టించాడు. టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో 8 వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. భూటాన్‌లోని గెలపు సిటీలో మయన్మార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. డిసెంబర్ 26వ తేదీన ఈ మ్యాచ్ జరిగినట్లు తెలుస్తోంది. 22 ఏళ్ల ఆ బౌలర్ ఏడు పరుగులు ఇచ్చి ఎనిమిది వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన భూటాన్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 రన్స్ చేసింది. అయితే టార్గెట్ చేస్తున్న సమయంలో మయన్మార్ జట్టు కేవలం 45 రన్స్‌కే ఆలౌటైంది. భూటాన్ క్రికెట్ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో ఈ అంశాన్ని పోస్టు చేసింది. సోనమ్ యేషే అసాధారణ రికార్డు నెలకొల్పాడని, 7 పరుగులు ఇచ్చి8 వికెట్లు తీసుకున్నాడని, ఇది వరల్డ్ రికార్డు అని, ఇది ఎంతో అరుదైన ఘటన అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో కానీ, ఇతర టోర్నీల్లో కానీ 8 వికెట్లు తీసుకున్న బౌలర్ లేరు. గతంలో మలేషియా పేస్ బౌలర్ స్యజ్రుల్ ఇద్రస్ 8 పరుగులు ఇచ్చి ఏడు వికెట్లు తీసుకున్నారు. 2023లో చైనాతో జరిగిన మ్యాచ్‌లో ఆ ఘనత సాధించారు.



# రిలీజ్ ముంగిట మరో ట్రైలర్.. చూశారా?




ప్రభాస్ 'రాజాసాబ్' నుంచి మరో ట్రైలర్ వచ్చేసింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలోనే ట్రైలర్ రిలీజ్ చేస్తారేమోనని అభిమానులు ఆశపడ్డారు కానీ ఆదికాస్త ఆలస్యమైంది. ఇప్పుడు దాన్ని విడుదల చేశారు. గతంలో తీసుకొచ్చిన ట్రైలర్‌కి ఏ మాత్రం తగ్గకుండా ఇది ఉంది. ఇందులో కామెడీ, హారర్ లాంటి ఎమోషన్స్ బాగానే చూపించారు. ఈ సినిమా.. జనవరి 9న థియేటర్లలోకి రానుంది. 8వ తేదీన రాత్రి ప్రీమియర్లు కూడా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ప్రీమియర్లు, టికెట్ రేట్ల గురించి క్లారిటీ రావొచ్చు. లేదంటే మాత్రం 8వ తేదీ సెకండ్ షోల నుంచి సినిమా రిలీజ్ అవుతుంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా చేశారు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషించారు. మారుతి దర్శకుడు. తమన్ సంగీతమందించాడు.




## పెద్ది నుండి సర్‌ప్రైజ్.. అసలు ఈ నటుడిని గుర్తు పట్టలేకపోతున్నాముగా!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నేషనల్ అవార్డు విన్నర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి మరో ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో అప్పలసూరి అనే కీలక పాత్ర ఫస్ట్ లుక్‌ను మేకర్స్ సోమవారం (డిసెంబర్ 29) విడుదల చేశారు. అయితే ఈ పోస్టర్ చూసిన అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. పోస్టర్‌లో కనిపిస్తున్న వ్యక్తి ఎవరో గుర్తుపట్టలేక చాలా మంది ఫ్యాన్స్ ముక్కున వేలేసుకున్నారు. తర్వాత అది జగపతి బాబు అని తెలిసి ఆశ్చర్యానికి లోనయ్యారు. స్టైలిష్, పవర్‌ఫుల్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న జగపతి బాబు, ఈసారి మాత్రం పూర్తిగా భిన్నమైన అవతారంలో దర్శనమివ్వబోతున్నారు. 'పెద్ది' సినిమాలో అప్పలసూరి పాత్ర కోసం జగపతి బాబు పూర్తిగా తన రూపాన్ని మార్చుకున్నట్లు ఈ ఫస్ట్ లుక్ స్పష్టంగా చెబుతోంది. గడ్డం, రఫ్ లుక్, కళ్లలో కనిపించే ఇంటెన్సిటీతో ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో అర్థమవుతోంది. ఈ మధ్య కాలంలో తనకు సరిపోయే బలమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జగపతి బాబు, ఈ సినిమాలో మరో మాస్టర్‌క్లాస్ పర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నాడని టాక్. ఈ ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తూ 'పెద్ది' మూవీ టీమ్ తమ అధికారిక ఎక్స్ (ట్విట్టర్) అకౌంట్‌లో పెద్దిలో అప్పలసూరిగా అద్భుతమైన జగపతి బాబు. ఓ బలమైన, ప్రభావవంతమైన పాత్రలో అతని మాస్టర్‌క్లాస్ పర్ఫార్మెన్స్ చూడటానికి సిద్ధంగా ఉండండి. పెద్ది మార్చి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది అని ట్వీట్ చేసింది. ఈ పోస్టర్‌ను రామ్ చరణ్ కూడా తన సోషల్ మీడియా అకౌంట్‌లో షేర్ చేస్తూ ప్రశంసలు కురిపించారు. "స్క్రీన్‌కు అతడు తీసుకొచ్చే ఇంటెన్సిటీ మరెవరి వల్లా సాధ్యం కాదు. జగపతి బాబు గారిని పెద్దిలో అప్పలసూరిగా చూడటం చాలా సంతోషంగా ఉంది" అని ట్వీట్ చేశారు. రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు లెజెండరీ కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

## ట్రెండింగ్ రీల్‌తో.. పెళ్లి తేదీని ప్రకటించిన అల్లు శిరీష్



అల్లువారి ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, స్టార్ హీరో అల్లు అర్జున తమ్ముడు అల్లు శిరీష్ త్వరలో వివాహబంధంలోకి అడుగుపెట్టబోతున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనిక తో అల్లు శిరీష్ నిశ్చితార్థం ఇటీవలే ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. దీంతో వీరి పెళ్లి గురించి అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వెడ్డింగ్ డేట్‌ను అల్లు శిరీష్ అధికారికంగా ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా ఆసక్తికర వీడియో ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అర్హ, అల్లు అయాన్‌తో కలిసి రీల్ చేస్తూ పెళ్లి తేదీని ప్రకటించారు అల్లు శిరీష్. 'బాబాయ్ పెళ్లి ఎప్పుడు..?' అని పిల్లలు అడగ్గా.. 'మార్చి 6, 2026' అని సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత 'సంగీత్ ఎప్పుడు ఉంటుంది..?' అని ప్రశ్నించగా.. 'మనం దక్షిణాదివాళ్లం.. అలాంటివి చేసుకోం' అని చెప్పారు. ఈ రీల్ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు సంతోషం వ్యక్తం చేస్తూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా, శిరీష్-నయనకది ప్రేమ వివాహం. వారిద్దరికీ హీరో నితిన్ భార్య ఏర్పాటు చేసిన ఫంక్షన్‌లో తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ సమయంలో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి, ఇప్పుడు పెళ్లికి దారి తీసింది. ఇరు కుటుంబ సభ్యుల అంగీకారంతో వీరు వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. అల్లు శిరీష్ చివరిసారిగా 2024లో విడుదలైన యాక్షన్-కామెడీ ఫాంటసీ చిత్రం 'బడ్డీ' లో కనిపించారు.



## మళ్లీ మాతృగడ్డపై ప్రియాంక మోహన్

బహుభాషా నటీనటులకు అడ్వాంటేజ్ ఏమిటంటే ఏదో ఓ భాషలో అవకాశాలు వస్తూనే ఉండటం. అలా 2016లో వంద కథే హెల్లా అనే కన్నడ చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయిన శాండిల్ వుడ్ బ్యూటీ ప్రియాంక మోహన్. ఆ తరువాత తెలుగులో శ్రీకారం, నాని 'గ్యాంగ్ లీడర్' వంటి చిత్రాల్లో నటించే అవకాశాలను పొందారు.ఆ తరువాత వెంటనే కోలీవుడ్ ఆహ్వానించింది. ఇక్కడ డాక్టర్, డాన్ వంటి హిట్ చిత్రాల్లో నటించారు. సూర్య సరసన ఎదర్కుమ్ తుణిందవన్, ధనుష్‌తో కలిసి కెప్టెన్ మిల్లర్ చిత్రాల్లో నటించారు.

అలా ఈమె చివరిగా ధనుష్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'జాబిలమ్మ నీకు అంత కోపమా' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్‌లో నటించారు. అదేవిధంగా తెలుగులో ఓజీ చిత్రంలో నటించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రియాంక మోహన్‌ను మళ్లీ మాతృభాష ఆహ్వానించింది. ఈమె చాలా గ్యాప్ తరువాత కన్నడంలో భారీ చిత్రంలో నటిస్తున్నారు. శివరాజ్ కుమార్, యువ నటుడు డాలీ ధనుంజయ హీరోలుగా నటిస్తున్న తాజా చిత్రం 666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్..

ఇందులో నటి ప్రియాంక మోహన్ కథానాయకిగా నటిస్తున్నారు. వైశాక్ జే.ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హేమంత్ ఎం.రావ్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో నటి ప్రియాంక మోహన్ ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. అది ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తాను ఇంతకుముందు నటించిన చిత్రాలకు పూర్తి భిన్నంగా నటనకు అవకాశం ఉన్న పాత్రను ఈ చిత్రంలో పోషిస్తున్నట్లు ప్రియాంక మోహన్ పేర్కొన్నారు.




## అఖండ 2తో మరోసారి సత్తా చాటిన బాలయ్య.. యూఎస్ మార్కెట్‌లో అరుదైన రికార్డు

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా, సంయుక్త మీనన్ హీరోయిన్‌గా దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన భారీ అవైటెడ్ సీక్వెల్ 'అఖండ 2' బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌తో దూసుకెళ్తోంది. కొన్నేళ్ల క్రితం సంచలన విజయం సాధించిన 'అఖండ'కు సీక్వెల్‌గా 'అఖండ 2: తాండవం' పేరుతో విడుదలైన ఈ చిత్రం, మిశ్రమ స్పందనలు వచ్చినప్పటికీ బాలయ్య రికార్డుల పరంపరను కొనసాగిస్తోంది. ముఖ్యంగా నార్త్ అమెరికా మార్కెట్‌లో బాలకృష్ణకు ఉన్న క్రేజ్ మరోసారి రుజువైంది. 'అఖండ 2'తో కలిపి బాలయ్య వరుసగా ఐదు సినిమాలు యూఎస్‌లో 1 మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్ల మార్క్‌ను అందుకోవడం విశేషంగా మారింది. ఈ జాబితాలో అఖండ 1, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్, అఖండ 2 ఉన్నాయి. సీనియర్ హీరోగా ఇలా వరుసగా ఐదు సినిమాలు ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం చాలా అరుదైన రికార్డుగా నిలుస్తోంది. ఇదే కాకుండా, బాలయ్య నార్త్ అమెరికాలో మొత్తం ఆరు 1 మిలియన్ డాలర్ల సినిమాలు కలిగిన ఏకైక సీనియర్ హీరోగా కూడా రికార్డు సృష్టించారు. ఈ లిస్ట్‌లో 'గౌతమీపుత్ర శాతకర్ణి' సినిమా కూడా ఉండటం విశేషం. దీంతో టాలీవుడ్ సీనియర్ హీరోలలో యూఎస్ మార్కెట్ విషయంలో బాలకృష్ణదే స్పష్టమైన ఆధిపత్యంగా సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. క్రిటిక్స్ టాక్ ఎలా ఉన్నా, అభిమానుల మద్దతు మరియు బాక్సాఫీస్ స్థిరత్వంతో బాలయ్య తన మార్కెట్ పవర్‌ను మరోసారి నిరూపించారు. 'అఖండ 2' విజయం నందమూరి అభిమానులకు మాత్రమే కాకుండా, సీనియర్ హీరోలకూ స్ఫూర్తినిచ్చే రికార్డుగా నిలుస్తోంది. ఇక బాలయ్య ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ప్రస్తుతం ఎన్బీకే 111 చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ కూడా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. వచ్చే ఏడాది చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ చిత్రం కూడా బాలయ్యకి బంపర్ హిట్ అందిస్తుందని విశ్వసిస్తున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com